అభివృద్ధికి చిరునామా.. పాత ముచ్చుమర్రి

- శాప్ చైర్మన్ చొరవతో నెరవేరిన ఏళ్ల నాటి కల
- రూ.1.53 కోట్లతో అభివృద్ధి పనులు
- సీసీ రోడ్ల నిర్మాణంతో కళకళలాడుతున్న కాలనీలు
- డీబీటీ, నాన్ డీబీటీ కింద ప్రజలకు చేకూరిన ఆర్థిక లబ్ధి రూ. 21.42 కోట్లు
- గ్రామస్తుల్లో వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు



నాడు: బీసీ కాలనీలో ఉన్నా మట్టి రోడ్డు



నేడు: సీసీ రోడ్డుతో కళకళలాడుతున్న దృశ్యం

ఇదీ కదా.. అభివృద్ధి

పగిద్యాల: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పాతముచ్చుమర్రి నేడు అభివృద్ధికి చిరునామాగా మారింది. 1980 శ్రీశైలం ప్రాజెక్ట్ నిర్మాణంలో సర్వం కోల్పోయిన పాత ముచ్చుమర్రి ప్రజలు కనీస మౌలిక సదుపాయాల కోసం 40 ఏళ్లు నిరీక్షించారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి గురించి పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి చొరవతో పాత ముచ్చుమర్రి వాసుల ఏళ్ల నాటి కల సాకారమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా సంక్షేమ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధికి దోహదపడడం వలన అప్పుల ఊబిలో నుంచి తేరుకోవడమే కాకుండా అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తున్నామని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి పనులు

గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమ నిధుల కింద రూ. 13లక్షలు, ఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 30 లక్షలతో గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించారు. శివాలయం వెనుక నేలగండి వాగుపై దెబ్బతిన్న కల్వర్టు స్లాబ్ మరమ్మతుకు రూ. 8 లక్షలు కేటాయించి పనుల పూర్తి చేయడం వలన బీసీ కాలనీవాసుల కష్టాలు తీరాయి. రూ. 43.60లక్షలతో గ్రామ సచివాలయ నిర్మాణం, రూ. 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ. 20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్, రూ. 10 లక్షల వ్యయంతో అసంపూర్తిగా మిగిలిపోయిన అంగన్‌వాడీ భవనం పూర్తి, 15వ ఆర్థిక సంఘం రూ. 5లక్షలతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. గ్రామానికి ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాల కింద రూ. 21.42 కోట్ల ఆర్థిక లబ్ధిని జగనన్న ప్రభుత్వం చేకూర్చింది. అలాగే మండల పరిషత్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు రూ. 82,90,398లు మంజూరైనట్లు ఎంఈఓ సుభాన్ తెలిపారు.





టీడీపీ హయాంలో అసంపూర్తిగా మిగిలిన అంగన్‌వాడీ భవనం, నేడు అందంగా రూపుదిద్దుకున్న భవనం

ఎన్నో ఏళ్ల కల నెరవేరింది



మాది ఎల్లాల గ్రామం. నీటి మునకకు గురికాగా 40 ఏళ్ల క్రితం పాత ముచ్చుమర్రిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాం. మాకు అంతర్గత రోడ్లు సరిగా లేక ఎన్నో అవస్థలు పడ్డాం. వర్షకాలం వస్తే ఇళ్ల ముందర వర్షపునీరు నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లేది. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చొరవతో మా కాలనీలో సీసీ రోడ్డు వేశారు. నెల నెల వితంతు పింఛన్ కింద రూ. 3 వేలు ఇంటికి వచ్చి ఇస్తున్నారు. జగనన్న ప్రభుత్వంలోనే మా ఇళ్ల ముందర సీసీ రోడ్లు పడ్డాయి. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నాను. – **వెంకటలక్ష్మమ్మ, పాత ముచ్చుమర్రి**

లక్షలాది రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించారు



పాత ముచ్చుమర్రి పంచాయతీ అభివృద్ధికి చిరునామాగా నిలువడం ఆనందంగా ఉంది. సుమారు రూ. 1.53 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, అంగన్‌వాడీ భవనం, శిథిలమైన కల్వర్టు స్లాబ్‌కు మరమ్మతు పనులు శరవేగంగా పూర్తి చేసిన అధికారులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్నా జగనన్న ప్రభుత్వం మళ్లీ రావాలని ఆకాంక్షిస్తున్నా. – **నాగేశ్వరరెడ్డి,పాత ముచ్చుమర్రి**

శరవేగంగా అభివృద్ధి పనులు



పాత ముచ్చుమర్రి పంచాయతీలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేశాం. గడప గడపకు మన ప్రభుత్వం, ఎస్‌ఆర్‌ఈజీఎస్, నిధులతో బీసీ కాలనీలో సీసీ రోడ్లు వేయడంతో కళకళలాడుతున్నాయి. ఇంకా సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు పూర్తి అయ్యాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ప్రాధాన్యతను బట్టి అభివృద్ధి పనులకు వ్యయం చేశాం. మండలంలోని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాం. – **వెంకటేశ్వర్లు, ఏఈ, పగిద్యాల**

క్లుప్తంగా

శివుడికి ప్రీతి కరం బిల్వ పత్రం



శివాలయంలో లక్ష బిల్వార్చన పూజలో శివస్వాములు

పాములపాడు: శివుడికి ప్రీతికరం బిల్వ పత్రం అని పురోహితుడు పవన్‌కుమార్ శర్మ అన్నారు. శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామ శివాలయంలో గురుస్వామి రామకృష్ణ ఆధ్వర్యంలో లక్షబిల్వార్చన పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాల నుంచి శివ మాల ధరించిన స్వాములచే మాఘ పౌర్ణమి రోజు లక్షబిల్వార్చన పూజ చేస్తున్నామన్నారు. ఈ పూజ చేయడం వలన శుభిక్షం, లక్ష్మీకటాక్షం, సరస్వతీ కటాక్షం ప్రాప్తిస్తుందన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు



చేతి పంపును మరమ్మతు చేస్తున్న సిబ్బంది

పాములపాడు: మండల కేంద్రంలో శనివారం 5 చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. సర్పంచు మేకల బాగ్యమ్మ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా కాలనీల్లోని చేతి పంపులకు మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. అంతే కాకుండా ప్రధాన మిట్టకందాల గ్రామ రహదారిలో చౌడమ్మ దేవాలయం వద్ద ఉన్న చేతి పంపును కూడా రిపేరీ చేయించడం జరిగిందన్నారు. రహదారిలో వెళ్లే బాటసారులు, పొలాలకు వెళ్లే వారికే కాకుండా, పశువులకు కూడా ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే పరిష్కారం చర్యలు తీసుకుంటామని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాజశేఖర్ ఉన్నారు.

మహానంది సూపరింటెండెంట్‌కు పదోన్నతి



వెంకటేశ్వరుడుకు ఉత్తర్వులను అందిస్తున్న ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: మహానంది దేవస్థానం సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఓంకారం వెంకటేశ్వరుడుకు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పిస్తూ దేవదాయ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శనివారం మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడుకు ఆ ఉత్తర్వులను అందించారు. ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు రవిశంకర అవధాని, ఏఈఓ వై.మధు, ఆలయ సిబ్బంది నాగమల్లయ్య తదితరులు ఆయనను అభినందించారు. పదోన్నతి వచ్చిన సందర్భంగా దేవస్థానానికి రూ.50వేలు విలువ చేసే సీసీ కెమెరాలను విరాళంగా ఇచ్చారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

వెలుగోడు: రైతులు పండించిన జొన్నను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం రేగడగూడురు గ్రామంలోని ఆర్‌బీకే వద్ద జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జొన్న పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. జొన్న క్వింటాల్ బయట మార్కెట్‌లో రూ.2,600 ఉండగా ప్రభుత్వం రూ.3,180 మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మీ రెడ్డి, జయరామిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఏఎస్ఐ జాన్సన్

శ్రీశైలంప్రాజెక్ట్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఏఎస్ఐ జాన్సన్ అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ కాలనీలో పూర్వ క్రీడాకారుల ఆధ్వర్యంలో శని, ఆదివారాలలో స్టేట్‌బ్యాంక్ వద్ద ఉన్న జూనియర్ కళాశాల మైదానంలో బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్ కళాశాల అధ్యాపకుడు సూర్యనారాయణ మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడకు ఉన్నత చదువుల్లోనూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ రిజర్వేషన్లు ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు పిల్లలను విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

మిడుతూరు: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎస్ఐ జగన్మోహన్ హెచ్చరించారు. శనివారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అనుమతి పత్రాలు లేనివారికి జరిమానా విధించారు.

శివస్వాముల ధర్నా

ఆత్మకూరు: పవిత్రమైన పుణ్యక్షేత్రాలకు వెళ్లాలంటే అటవీ శాఖ అధికారులకు రుసుము ఎందుకు చెల్లించాలని శివస్వాములు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అటవీ శాఖ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు సుదర్శనశర్మ మాట్లాడుతూ శ్రీశైలానికి కాలినడకన నాగలూటి నుంచి అటవీ మార్గంగా వెళ్లాలంటే ఒక్కొక్కరికి రూ.10 ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. ఇప్పటికే రుద్రకోడూరు పుణ్యక్షేత్రానికి వెళ్లాలంటే ప్రతి వాహనానికి రూ.300, బైర్లూటి, దోర్నాల మీదుగా శ్రీశైలం క్షేత్రానికి వెళ్లే భక్తుల వాహనాలకు రూ.300, ఇష్టకామేశ్వరి అమ్మవారికి దేవాలయానికి రూ.1000 చొప్పున అటవీ శాఖ అధికారులు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇది ఎంత వరకు సమంజసమన్నారు. ఈ ఏడాది శివరాత్రికి దాదాపు 5లక్షల మంది భక్తులు శ్రీశైల క్షేత్రానికి వెళ్లే అవకాశం ఉందని, ప్రతి భక్తుడి వద్ద రూ.10 వసూలు చేస్తే లక్షలాది రూపాయలు భక్తుల నుంచి అటవీ శాఖ వసూలు చేస్తుందని చెప్పారు. ఇలా వసూలు చేయాలని ఫారెస్ట్ శాఖ సంబంధిత అధికారులు లేదా ప్రభుత్వాలు జీవోలు విడుదల చేశాయా అని ప్రశ్నించారు. అంతకు మునుపు పట్టణంలోని ఆత్మ రామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి పట్టణంలోని పురవీధుల గుండా అటవీ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

సంక్షేమానికి సమాంతరంగా అభివృద్ధి



సీసీ రోడ్డను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి సమాంతరంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు అమీరున్‌బీ అన్నారు. శనివారం పట్టణంలోని రోఖియాబీ దర్గా వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, నాడు–నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి ఆర్థికంగా భరోసా అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, సర్పంచ్ జయపాల్, ఎంపీపీ లాలం రమేష్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, అచ్చయ్య, ఆరీఫ్, షంషీర్ అలీ, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్ఫూర్తితో పేద పిల్లల చదువుకు చేయూత



చైతన్య స్కూల్ నిర్వాహకులకు పిల్లల ఫీజు చెల్లిస్తున్న భరత్ శర్మ

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్ఫూర్తితో మిడుతూరు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన వేదపండితులు, అస్ట్రాలజీ ప్రావీణ్యులు పీ. వీ భరత్ శర్మ పేద విద్యార్థుల చదువుకు చేయూతనందిస్తున్నారు. 45 మంది పేద విద్యార్థులను నందికొట్కూరులోని శ్రీచైతన్య కార్పొరేట్ స్కూల్‌లో చదివిస్తున్నారు. ఆ విద్యార్థులకు సంబంధించిన ఫీజులను శనివారం పట్టణంలోని పాఠశాలలో చెల్లించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద పిల్లలందరూ బడిలోనే ఉండాలనే ఆకాంక్షతో అమ్మ ఒడి పథకం అమలు చేయడం స్ఫూర్తి తీసుకొని పేద పిల్లల చదువులకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నాన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి



పట్టణంలో హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆత్మకూరు: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని కళాకారులు రాజు, క్రాంతి, గౌసియా అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల, గౌడ్‌సెంటర్, పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, నంద్యాల టర్నింగ్ తదితర ప్రాంతాల్లో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారి సుఖ వ్యాధుల నుంచి వ్యాప్తి చెందుతుందని, ఇందు వల్ల సురక్షితమైన లైంగిక విధానం అనుసరించాలన్నారు. కార్యక్రమంలో రాజు, ముర్తుజాబీ, కళాకారులు పాల్గొన్నారు.

ప్రజలందరూ శాంతియుతంగా జీవించాలి



పల్లెనిద్ర సమావేశానికి హాజరైన గ్రామస్తులు

పాములపాడు: గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వాడాల గ్రామంలో సీఐ నాగభూషణ్, ఎస్ఐ అశోక్‌లతో కలిసి పల్లెనిద్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు వహించాలన్నారు. గ్రూపు తగాదాలకు తావివ్వద్దని, వర్గాలుగా విడిపోయి ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి వేడుకలు



బొల్లవరంలో ప్రత్యేక అలంకరణలో స్వామి అమ్మవార్లు



ప్రత్యేక అలంకరణలో జమ్ములమ్మ దేవి

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలో గ్రామాల్లో శనివారం మాఘపౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని బొల్లవరం గ్రామం వద్దనున్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అర్చకులు, గ్రామస్తులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా భారతాల పున్నమి

కొత్తపల్లి: మండల కేంద్ర శివారుల్లో వెలసిన జమ్ములమ్మ దేవాలయంలో శనివారం భారతాల పున్నమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని వీరాపురం, బావాపురం, కొత్తపల్లి గ్రామాలతో పాటు ఆత్మకూరు మండలంలోని కురుకుంద, వడ్లరామాపురం, గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామ నివాసి పల్లా పడగలయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి ఒడి బియ్యం, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ జంబులాపరమేశ్వరి ఆలయంలో శనివారం బారసాల పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు.

ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడికి సతీ వియోగం

మిడుతూరు: మండలపరిధిలోని 49– బన్నూరు గ్రామానికి చెందిన నంద్యాల జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి సతీమణి ప్రతిమ అనారోగ్యంతో యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏపీ శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, తిమ్మాపురం సర్పంచ్ నాగస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లు శివనాగిరెడి హైదరాబాదు చేరుకొని పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

మహానంది: అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్తామామలు వేధిస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. గాజులపల్లె గ్రామానికి చెందిన కొండెపోగు జాస్లీన్‌కు ఎమ్మిగనూరుకు చెందిన కమల్‌కుమార్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ బాబు ఉన్నాడు. అయితే ఇటీవల భర్త కమల్‌కుమార్‌తో పాటు అత్త, మామ, భర్త అక్క అదనపు కట్నం కోసం నిత్యం వేధిస్తున్నారని, మానసికంగా బాధపెడుతున్నారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందన్నారు.

శిరీషాబాయి మృతికి కారకులను అరెస్ట్ చేయాలి

ఆత్మకూరు: గిరిజన మహిళ శిరీష మృతికి కారణమైన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని బీసీ సంఘం నాయకులు డాక్టర్ నాగన్న, మాలమహానాడు నాయకులు మల్లయ్య, శీలంశేషు, ఎమ్మార్పీఎస్ నాయకులు దర్గయ్య మాదిగ, గిరిజన ఉపాధ్యాయ సంఘం నాయకులు జవహర్‌నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి నాగయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి, బంజార సంఘం నాయకులు నరసింహనాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాతబస్టాండ్‌లో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బాధితులకు రక్షణకల్పించాల్సిన పోలీసులు నిరసన కొనసాగిస్తున్న సమయంలో శిరీషాబాయి బంధువులపై లాఠీ చార్జీ చేయడం సమంజసం కాదన్నారు. దాడికి పాల్పడిన సీఐ, ఇద్దరు ఎస్ఐలు, నలుగురు కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



మల్లన్న దర్శనానికి వెళ్తున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్. హరినాథ్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం ఆలయం వద్ద కు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు అలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి. పెద్ది రాజు, అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామి వారిని, భ్రమరాంబా దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

సాష్టాంగ నమస్కారాలతో శ్రీశైలానికి



సాష్టాంగ నమస్కారం పెడుతున్న భక్తురాలు

జూపాడుబంగ్లా: శ్రీశైల భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లపై ఉన్న భక్తిప్రపృత్తులతో కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు స్వామివారికి సాష్టాంగ నమస్కారాలు పెడుతూ శ్రీశైలం వెళ్తున్నారు. కర్ణాటక రాష్ట్రం, జమ్‌ఖండి జిల్లా, హుల్యాల గ్రామానికి చెందిన శాంత, దానమ్మ సాష్టాంగ నమస్కారాలు పెడుతూ గత 20 రోజుల నుంచి శ్రీశైలం యాత్ర కొనసాగిస్తున్నారు. శుక్రవారం వారితో పాటు వారి భర్తలు మలింగయ్య, మహదేవయ్య జూపాడుబంగ్లాకు చేరుకోగా వారిని గ్రామస్తులు పలకరించారు. 20 రోజుల నుంచి 600కిలో మీటర్ల మేర సాష్టాంగ నమస్కారాలు పెడుతూ వస్తున్నట్లు తెలిపారు.

ఎల్ఐసీని కాపాడుకోవాలి

ఆత్మకూరు: ఎల్ఐసీ సంస్థను కాపాడుకోవాలని ప్రైవేటీకరణను వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని లియాఫీ (లైఫ్ ఇన్సురెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) సభ్యులు, ఆల్ ఇండియా లీడర్స్ నాయకులు నారాయణరెడ్డి, సౌత్‌సెంటర్ నాయకులు కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో శనివారం లియాఫీ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. కడప రీజనల్ అధ్యక్షులు జయభారత్‌రెడ్డి, కార్యదర్శి పాండు రంగనాయక్‌లు ప్రసంగించారు. ఆత్మకూరు ఎల్ఐసీ లియాఫీ అధ్యక్షుడిగా స్వామిదాస్, కార్యదర్శిగా సాయిబాబా, ట్రెజరర్‌గా రాంబాబు, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాదిగలను మోసం చేస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణ చేస్తామని చెప్పిన బీజేపీ మాదిగలను మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి జైకిసాన్ పార్కు వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాన్షీరామ్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన విస్తృస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలను నమ్మించి నట్టేట ముంచేసిన పార్టీ బీజేపీయేనన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఉధృత పోరుబాట తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, జిల్లాల నాయకులు లింగాల స్వాములు, పులికొండ, స్థానిక నాయకులు నాగరాజు, రమణ, సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించేంత వరకు పోరాటం ఆగదు

కొత్తపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధించేంత వరకు తమ పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సంపంగి మద్దిలేటి అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో జరిగే ముఖ్యకార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈ.రాజు, నందికొట్కూరు ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ ప్రేమరాజు హాజరయ్యారు. వర్గీకరణపై కర్నూలులో ఈనెల 28న ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి డాన్ శీను, ఓబులేసు, నారాయణ, పాములపాడు నాయకులు రమేష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఉద్యోగి మృతి

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.రాంపాల్ (58) శనివారం అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. 1984లో దేవస్థానంలో హెల్పర్‌గా నియామకమై ప్రస్తుతం రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో కర్నూలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం ఉదయం మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డాక్టర్ రామలింగారెడ్డి మహిళా డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో 52వ రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయని నంద్యాల జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహబూబ్‌బాషా, రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో పశ్చిమగోదావరి జట్టు స్వర్ణంతో చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. కర్నూలు జట్టుకు రజతం, నంద్యాలకు కాంస్య పతకాలు దక్కాయన్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, టోర్నమెంట్ కమిటీ అధ్యక్షుడు సుధాకర్ ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, లక్ష్మణ్, జాన్‌దత్తరావు, సురేష్ పాల్గొన్నారు.